క్లుప్తంగా

పాఠశాలల్లో వైద్యశిబిరాలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మనోజ్ఞ

కొయ్యూరు: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, బాలుర–1,2 పాఠశాలల్లో రాజేంద్ర పాలెం వైద్యుడు మనోజ్ఞ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణలో మార్పుల కారణంగా కండ్ల కలకతో పాటు వైరల్ జ్వరాలు సోకే ప్రమాదముందని జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, దోమ తెరలు వాడాలన్నారు. మరగబెట్టిన నీటిని తాగాలని సూచించారు. అత్యవసరమైతే ఆస్పత్రికి తీసుకురావాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ మోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూల మొక్కలకు గిరాకీ



పూల మొక్కలు విక్రయిస్తున్న వ్యాపారి

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని శుక్రవారం అరకు వారపు సంతలో పూలమొక్కలతో పాటు మామిడి, జామ తదితర మొక్కలకు గిరాకీ నెలకొంది. తుని, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి మొక్క లను విక్రయించారు. గులాబి, చామంతి, మందారం తదితర మొక్కలు ఎక్కువగా అమ్ముడయ్యాయి. గులాబి మొక్క రూ.100, మందా రం మొక్క రూ.50లకు విక్రయించారు. పూలమొక్కల అమ్మకాలు బాగా జరుగుతున్నాయని ఆశాజనకంగా లాభాలున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రాజవొమ్మంగి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ సిబ్బంది శుక్రవారం ఆందోళన చేశారు. తమకు న్యాయం జరగకపోతే వచ్చే నెల 10వ తేదీ నుంచి సమ్మెకు ఉపక్రమిస్తామన్నారు. వీరికి మద్దతుగా స్థానిక సీఐటీయూ నాయకుడు పుట్ట రామరాజు పాల్గొన్నారు. సబ్ ఇంజినీర్ సురేష్‌కుమార్, సిబ్బంది రాంబాబు, కిరణ్, చిట్టిబాబు, దొర, ప్రసాద్, రాఘవ, శివ, లోవప్రసాద్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పొంగిన గెడ్డలతో ఇబ్బందులు



పొంగి ప్రవహిస్తున్న చాపరాయి గెడ్డ

డుంబ్రిగుడ: మన్యంలో కురుస్తున్న భారీ వర్షానికి మన్యంలో ఉన్న గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో గ్రామస్తులు గెడ్డలను దాటేందుకు నానా అవస్థలు పడుతున్నారు. బ్రిడ్జిలు లేకపోవడంతో రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నామని స్థానికులు చెబుతున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

అరకులోయ రూరల్: మణిపూర్ సంఘటనను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నాయకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఇందుకు దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. దేశంలో మరెక్కడా ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. మహిళల కోసం ప్రత్యేకమైన చట్టాలు అమలు చేయాలన్నారు. లోకనాథం, అప్పలనర్స, గంగరాజు, ఉమామహేష్, సురేంద్ర, బాలదేవ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు న్యాయం చేయాలి

అరకులోయ రూరల్: పొగరాని వంట పొయ్యిలు అందజేసేందుకు గిరిజనుల నుంచి వసూలు చేసిన సొమ్మును తిరిగి చెల్లించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు. ఆయన శుక్రవారం బాధిత లబ్ధిదారులతో మాట్లాడారు. పలు మండలాల్లో గిరిజనుల నుంచి ప్రైవేట్ సంస్థలు పొగరాని పొయ్యిల పంపిణీకి సొమ్ము వసూలు చేశారని ఆరోపించారు. అయితే పొయ్యిలు పంపిణీ చేయలేదని, ఆయా సంస్థలు లబ్ధిదారులకు సొమ్ము వాపసు చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని లబ్ధిదారులకు న్యాయం జరిగిలా చూడాలని కోరారు.

సిరుల 'పట్టు'



పట్టుపురుగులు

- మల్బరీ సాగుతో లాభాలు
- రూ.లక్షల్లో ఆదాయం
- రైతులకు ప్రభుత్వ సాయం
- ఏటా పెరుగుతున్న విస్తీర్ణం



షెడ్డులో పట్టుపురుగుల పెంపకాన్ని పరిశీలిస్తున్న అధికారి

రాజవొమ్మంగి: మల్బరీ సాగు రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. కుటీర పరిశ్రమగా నిలిచిన పట్టుపురుగుల పెంపకం లాభాలకు పట్టునిల్లుగా మారుతున్నాయి. తక్కువ ఖర్చుతో అధిక లాభాలకు బాటలు వేస్తున్నాయి. రాజవొమ్మంగి మండలంలో విస్తారంగా మల్బరీ సాగులో ఉంది. ఏటా ఐదు నుంచి ఆరు పంటలు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. మండలంలోని 250 ఎకరాల్లో మల్బరీ పంట సాగులో ఉంది.

పట్టుపురుగుల పెంపకం చేస్తున్న రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోంది. పటు పరిశ్రమ శాఖ పలు విధాలుగా ప్రోత్సాహం అందిస్తోంది. మల్బరీ పరికరాలను సబ్సిడీపై అందజేయడమే కాక, ఎరువులు, పలు రకాల మందులు అందజేస్తోంది. పట్టుపురుగులను పెంచేందుకు అవసరమైన షెడ్ల నిర్మాణానికి కూడా ప్రభుత్వం రాయితీపై నిధులు అందజేస్తు రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తోంది.

షెడ్డులో పట్టుగూళ్లు

ఎకరా నేలలో మల్బరీ తోట పెంచి ఏడాదిలో ఆరు పంటలు తీస్తున్నారు. మల్బరీ తోటలు ఏపుగా పెరిగిన తరువాత పట్టుపురుగుల గుడ్లను (లేయింగ్స్) తెచ్చి రేరింగ్ షెడ్డులో ఉంచుతారు. గుడ్ల నుంచి పిల్ల పురుగులు బయటకు రాగానే వాటికి మల్బరీ ఆకులు మేతగా వేస్తారు. తొలుత ఆకులను సన్నగా తరిగి వేస్తారు. రానురాను పూర్తి ఆకులను పట్టుపురుగులకు మేతగా వేస్తారు. రోజుకు రెండు మేతలు వేస్తారు. బాగా ఎదిగిన పట్టుపురుగులు గూళ్లు పెట్టే దశకు వస్తాయి. పెరిగిన పట్టు పురుగులను రేరింగ్ షెడ్డులోని చంద్రికల్లో(తయారు చేసిన గూళ్లు)కి ఎక్కిస్తారు. చంద్రికల్లో పెట్టిన పట్టు పురుగులు గూళ్లు పెడతాయి. ఆరోగ్యకరమైన ఆకులు పురుగులకు మేతగా వేస్తే నాణ్యమైన, బరువైన పట్టుగూళ్లను సాధించవచ్చని సెరీకల్చర్ సూపర్‌వైజర్ రాజన్నదొర అంటున్నారు.

మార్కెట్‌లో గిరాకీ

ఈ విధంగా వచ్చిన గూళ్లకు ప్రస్తుతం మార్కెట్టులో రూ. 400లకు పైగానే ధర పలుకుతుందని రైతులు చెబుతున్నారు. అదే శీతాకాలంలో అయితే కిలో రూ. 800ల వరకు ధర ఉంటుందని చెబుతున్నారు. ఒక పంటలో 200 గుడ్లు పెంచితే తద్వారా దాదాపు 125 కిలోల పట్టుగూళ్లు వరకు ఏర్పాటుచేసుకోవచ్చంటున్నారు. ఒక పంటకు ఎకరాకు రూ. 50వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వస్తుండడంతో గిరిజన రైతులు ఈ పంటపై మక్కువ చూపుతున్నారు. మల్బరీ తోటలను పశువుల నుంచి కాపాడుకోవడం ప్రధానమైన సమస్యగా ఉంటుందని ఇందుకు గాను తోటల చుట్టు కంచె వేసేందుకు అదనపు ఖర్చు తప్పడం లేదని రైతులు చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఆశాజకనమైన ఆదాయం సముపార్జనకు పట్టుపురుగుల పెంపకం ఎంతో దోహదపడుతోందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



మల్బరీ తోటను పరిశీలిస్తున్న అధికారులు

ఆదాయం బాగుంది



నేడు ఆరు ఎకరాల్లో మల్బరీ తోటలు వేశాను. సంవత్సరానికి 6 నుంచి 8 పంటలు తీస్తున్నాను. ఎకరాలో వేసిన పంటకు ఒక సారికి దాదాపు రూ. 1.2 లక్షల ఆదాయం వస్తోంది. కుటుంబసభ్యులతో కలిపి ముగ్గురు కూలీల సాయంతో పనులు చేస్తున్నాం. ఇప్పుడున్న పరిస్థితులలో పట్టుపురుగుల పెంపకంతో మంచి ఆదాయం వస్తోంది.

– దల్లి కొండమ్మ, రైతు, ముంచవరప్పాడు

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- గడప గడపకు విశేష స్పందన
- గ్రామస్తులతో కలిసి వరినాట్లు వేసిన ఎమ్మెల్యే ధనలక్ష్మి
- సమస్యల పరిష్కారానికి హామీ

రంపచోడవరం: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని రంప, మర్రివాడ, లొద్దిపాలెం, ధరమడుగుల, మూలపాడు తదితర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 325 గడపలను ఎమ్మెల్యే ధనలక్ష్మి సందర్శించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం పథకాలను పారదర్శకంగా, పార్టీలకతీతంగా అమలుచేస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. శివారు గ్రామాల్లో సైతం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా లొద్దిపాలెం గ్రామంలో పర్యటించి, మహిళా రైతులతో కలిసి వరినాట్లు వేశారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మిలు వరినాట్లు వేశారు. సకాలంలో, సక్రమంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఎంతో లబ్ధిపొందుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగనన్ననే మరలా ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ధనలక్ష్మి హామీ ఇచ్చారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు, మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశీ, మండల సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర, నాయకులు కొండ్రరాజు, బొబ్బా శేఖర్, రాంబాబు, కిట్టూ, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలకు బ్రోచర్‌ను అందజేస్తున్న న్యాయమూర్తి శివకిరణ్

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అరకులోయ ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ ఎం.శివకిరణ్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) కట్టడికి సమగ్ర చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఉన్నత చదువులు అభ్యసించి, ఉత్తమ పౌరులుగా నిలవాలని ఆకాంక్షించారు. మానవ అక్రమ రవాణా చట్టాలపై ముద్రించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీల తదితరులకు ఆయన బ్రోచర్లను అందజేశారు. లోక్ అదాలత్ సభ్యులు పి.మురళీమోహన్, ఎస్.రాంబాబు, న్యాయవాదులు బి.సింహాచలం, బి.ప్రభాకర్, బి.ప్రేమ్‌చరణ్, నీలకంఠం, ఎక్సైజ్ సీఐ గణపతి బాబు, కోర్టు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పరిశుభ్ర వాతావరణం



మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అనకాపల్లిటౌన్: భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మన అందరిపై ఉందని నోబుల్ చారిటీస్ అధ్యక్షురాలు శరగడం జయలక్ష్మి అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గవరపాలెం చారిటీస్ ఆవరణలో శుక్రవారం ఉచితంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవంతుడు మనకు స్వచ్ఛమైన నేల, నీరు, గాలితో కూడిన ప్రకృతిని ప్రసాదించారని, ప్రపంచ వ్యాప్తంగా ఈ ప్రకృతి వనరుల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ప్రతీ వ్యక్తి మూడు మొక్కలను నాటి, వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు ఓంరామ్, చారిటీస్ వ్యవస్థాపకుడు శరగడం నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మెట్టవలసలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మంజుభార్గవి తదితరులు

అనంతగిరి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, లంగుపర్తి వైద్యాధికారి డాక్టర్ మంజు భార్గవి తెలిపారు. లంగుపర్తి పీహెచ్‌సీ పరిధిలోని మెట్టవలస గ్రామంలోని శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మంజు భార్గవి మాట్లాడుతూ వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత ఆరోగ్యసూత్రలను పాటించాలన్నారు. గ్రామాల్లో అనారోగ్యానికి గురైతే వైద్య సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఏఎన్‌ఎం రోజా, ఎంఎల్‌హెచ్‌పీ వేణు, హెల్త్ అసిస్టెంట్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పాయకరావుపేట : ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరిగి, ప్రజలు చాలా త్వరగా మోసపోతున్నారని పాయకరావుపేట సీఐ అప్పలరాజు అన్నారు. శ్రీ ప్రకాష్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రలోభాలకు గురిచేసే ఫోన్ కాల్స్, లోన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ నేరాలు జరిగే తీరును వివరించి, వాటి బారిన పడి మోసపోకుండా ఎలా వ్యవహరించాలో వివరించారు. సదస్సులో ఎస్‌ఐ ఎస్.రమేష్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో కూలిన చెట్టు

- మూడు గంటల ట్రాఫిక్ జామ్



దారాలమ్మ ఘాట్‌రోడ్డులో రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు

సీలేరు: మండలంలోని ధారాలమ్మ ఘాట్‌రోడ్డులోని శుక్రవారం భారీ చెట్టు నెలకూలింది. సుమారు మూడు గంటల పాటుగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఘాట్‌రోడ్డులోని భారీ చెట్టు విరిగిపడింది. ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు వెనువెంటనే స్పందించి, జేసీబీ సాయంతో చెట్టు తొలగింపు చర్యలు చేపట్టారు. ఘాట్‌రోడ్డులోని ప్రమాదభరితంగా ఉన్న చెట్లను తొలగింపు చర్యలు చేపట్టాలని, వాహనదారులు కోరుతున్నారు.

నేడు విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

అనకాపల్లిటౌన్: నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8,9,10 తరగతుల విద్యార్థినులకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో శనివారం ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయనున్నట్టు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. క్రీడామైదానంలో సైకిళ్లను శుక్రవారం ఆయన పరిశీలించి, వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్‌చైర్మన్ కె.నిత్యానందరెడ్డి చేతుల మీదగా సైకిళ్లను పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. రూ.1.75 కోట్ల విలువ చేసే సైకిళ్లను 2,550మంది బాలికలకు అందజేయనున్నట్టు తెలిపారు. టాటా కంపెనీకి చెందని ఒక్కో సైకిల్ ఖరీదు సుమారు రూ.6,500 ఉంటుందని ఆయన చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో చదువుతున్న బాలికలకు కూపన్లు పంపిణీ చేశామని, కూపన్ తీసుకుని విద్యార్థినితో పాటు, తల్లిదండ్రుల్లో ఒకరూ రావాలని ఆయన కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ ఆధ్వర్యంలో క్రీడామైదానంలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వి.సుబ్బరాజు, సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీను, జెడ్పీ ఎస్.వెంకటరమణ, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు బేబీ కిట్స్ వితరణ

అనకాపల్లిటౌన్: జన్మించిన బిడ్డ ఆరోగ్యంగా ఎదగాలంటే వైద్యుల సూచనల మేరకు పౌష్టికాహారం అందించాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.జె.నాయుడు అన్నారు. గవరపాలెం వర్తక సంఘం ప్రసూతి ఆస్పత్రిలో 25 మంది బాలింతలకు క్లబ్ ఆధ్వర్యంలో బేబీ కిట్స్, పాలు, రొట్టెలు, పండ్లు, బూస్ట్ డబ్బాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీ నెల రెండు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి రాపేటి నారాయణరావు, ఆస్పత్రి అధ్యక్షుడు ఆళ్ల ప్రసాద్, కార్యదర్శి కోలపర్తి కన్నబాబు, వైద్యురాలు హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు రొట్టె, పాలు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



రచ్చబండ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: గిరిజన గ్రామలభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని దిగుడుపుట్టు గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.3.50లక్షల వ్యయంతో చేపట్టనున్న రచ్చబండ నిర్మాణ పనులకు వారు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయంతో పాటు రచ్చబండ నిర్మాణాలకు ప్రభుత్వం నిధుకు కేటాయిస్తోందన్నారు. ఇప్పటికే జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయలు కల్పిస్తున్నట్టు తెలిపారు. సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, నాయకులు అనిల్, సూరిబాబు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న మహేష్

కొయ్యూరు: అర్హతను ప్రామాణికంగా సంక్షేమ పథకాలను జగనన్న ప్రభుత్వం అందజేస్తోందని జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్ అన్నారు. మండలంలోని అంతాడ పంచాయతీ ఎద్దుమామిడిలో ఆయన శుక్రవారం పర్యటించి, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ఆదేశాలతో తాము గ్రామాల్లో పర్యటించి, సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సర్పంచ్ సుర్ల చంద్రరావు, నేతలు బాలరాజు, నూకరాజు, భీమరాజు, సత్య, పవన్, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సిన్



తంటికొండలో సర్పంచ్ శుభలక్ష్మి ఆధ్వర్యంలో పశువుకు టీకాలు వేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని తంటికొండ పంచాయతీలోని గింజర్తి గ్రామంలో సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి ఆధ్వర్యంలో పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధి గొంతువాపు నివారణకు హెచ్ఎస్ వ్యాక్సిన్ ఇచ్చారు. మొత్తం 47 పశువులకు వ్యాక్సిన్ వేసినట్టు వెటర్నరీ డాక్టర్ తరుణ్ తెలిపారు. వాతావరణంలో మార్పుల కారణంగా పశువుల్లో గొంతువాపు వ్యాధి సోకకుండా ముందుస్తుగా వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. గొంతువాపు వ్యాధి సోకిన పశువులు గురక, జ్వరం, నోటి నుంచి చొంగ కారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతాయని, తక్షణమే చికిత్స చేయించి, వ్యాక్సిన్ వేయించాలన్నారు. గొంతువాపు వ్యాధి సోకిన పశువును మందకు దూరంగా ఉంచాలన్నారు. ప్రస్తుతం 900 డోసుల వ్యాక్సిన్ ఉందని, పశువులను కొట్టాల్లో వుంచి వెటర్నరీ సిబ్బందిని సంప్రదింస్తే పశువులకు వ్యాక్సిన్ ఉచితంగా పొందవచ్చన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ కిషోర్ , జేకే ట్రస్ట్ ప్రతినిధులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక.. సాగునీటికి ఇక్కట్లు



అప్పలరాజుపేట వద్ద పిచ్చి మొక్కలు, చెత్తతో దర్శనమిస్తున్న పంటకాలువ




వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో జలకళ

రాజవొమ్మంగి: మండలంలోని కొన్ని ప్రాంతాల్లో పంట కాలువల్లో పూడిక చేపట్టాక శివారు ఆయకట్టు భూములకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పలరాజుపేటలోని వట్టిగెడ్డ రిజర్వాయర్, అమ్మిరేఖల రిజర్వాయర్‌లకు చెందిన పంట కాలువలు దారుణంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు గల 5 కిలోమీటర్ల నిడివిగల అతి పెద్ద పంటకాలువ ద్వారా దాదాపు 4వేల ఎకరాలకు తొలకరిలో సాగునీరు అందాల్సివుంది. కాగా ఈ పంట కాలువ గట్లు ఎక్కడికక్కడ గండ్లు పడి, పూడిక తీయక నిరుపయోగంగా మారిందని స్థానిక రైతులు చెబుతున్నారు.

పంటకాలువల్లో గుర్రపు డెక్క, జమ్ము, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాటు పెద్ద పెద్ద చెట్లు మొలచి సాగునీటి ప్రవాహానికి ప్రతిబంధకంగా మారాయంటున్నారు. పంటకాలువకు గల దాదాపు 14 డిస్ట్రిబ్యూషన్ మదుములు శిథిలావస్థకు చేరాయని సాగునీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వర్షాలకు రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తుండగా సాగునీరు ఆయకట్టు భూములకు చేరే దారి లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల పంట కాలువ పూడికతీత, గండ్లు పూడ్చివేతకు ప్రభుత్వం నిధుల మంజూరు చేసినా పనులను అధికారులు సకాలంలో చేపట్టక పోవడంతో నిధులు వెనుక్కు మళ్లాయని పలువురు చెబుతున్నారు. శ్రమదానంతో పంట కాలువలో పూడికతీత చేపట్టినా సమస్య పరిష్కారం కావడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సాగునీటి కాలువల్లో పూడికతీతతో పాటు గండ్లు పూడ్చివేత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ముమ్మరంగా శానిటేషన్ పనులు



రేఖపల్లి పునరావాస కేంద్రం వద్ద బ్లీచింగ్ జల్లుతున్న సిబ్బంది

వీఆర్ పురం: రేఖపల్లిలోని మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల పరిసర ప్రాంతాల్లో వరద బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో శానిటేషన్ పనులు ముమ్మరంగా చేపట్టినట్టు రేఖపల్లి, వడ్డిగూడెం పంచాయతీల కార్యదర్శులు శివప్రసాద్ , స్వరూప్‌రెడ్డిలు శుక్రవారం తెలిపారు. బాధితులు గుడారాల వద్ద బ్లీచింగ్ పౌడర్ జల్లడం , స్ప్రేయింగ్ చేయించినట్టు వారు చెప్పారు.